
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 12 । జూలై । 2025



టన్ను చీనీ రూ.18 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



మిస్సింగ్.. మిస్టరీ!
మహిళల అదృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏడాదిలో 225 మంది అదృశ్యం కాగా, 155 మంది ఆచూకీ తెలిసింది. మరో 70 మంది మిస్సింగ్ మిస్టరీ వీడలేదు. 8లో

గరిష్టం/కనిష్టం
36.2°/20.9°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

జనాభా పెరుగుదల అభివృద్ధికి అవరోధం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: జనాభా పెరుగుదల అభివృద్ధికి అవరోధమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజాబేగం అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని డీసీహెచ్ మధుసూదన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జనాభా పెరుగుదల వల్ల అన్ని రకాలుగా ఇబ్బందులు ఉంటాయన్నారు. జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సునీల్, డెమో బాబాఫకృద్దీన్, సీహెచ్‌ఓ శివరాం, ఐసీడీఎస్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద కారకుడికి జైలు



పెనుకొండ: వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి తనతో పాటు మరో ముగ్గురిని క్షతగాత్రులను చేసిన ఓ వ్యక్తికి పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప 3 నెలల జైలు శిక్ష విధించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన అమర్నాథరెడ్డి, రఘునాయక్, సుధాకర్, కుళ్లాయప్ప తదితరులు ఓ పని నిమిత్తం 2018 జూన్ 18న క్రూజర్ వాహనంలో పెనుకొండకు బయలుదేరారు. వాహనం అమర్నాథరెడ్డి నడుపుతున్నాడు. వీరి వాహనం ఆర్టీఓ చెక్‌పోస్ట్, రబ్బర్ ఫ్యాక్టరీ మధ్యకు రాగానే టైరు పేలి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలోని వ్యక్తులందరూ గాయపడ్డారు. ఈ మేరకు అప్పట్లో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తులో ప్రమాదానికి అమర్‌నాథ్‌రెడ్డి కారకుడిగా నిర్ధారించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప నేరం రుజువు కావడంతో ముద్దాయి అమర్‌నాథ్‌రెడ్డికి 3 నెలల జైలు, రూ.1,500 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

డెంగీతో బాలింత మృతి



షేక్ చాందిని (ఫైల్)

గార్లదిన్నె: డెంగీ జ్వరంతో ఓ బాలింత మృత్యువాతపడింది. ఈ ఘటనతో కల్లూరులో విషాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లికి చెందిన షేక్ చాందిని (22)కి ఏడాదిన్నర క్రితం గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన షేక్ సాదిక్ అనే కూలీతో వివాహమైంది. రెండు నెలల క్రితం చాందిని పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో ఈ నెల ఆరో తేదీన చాందినికి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు పామిడి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి డెంగీ జ్వరం అని తేల్చారు. దీంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సవీర ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స చేయించినా జ్వరం తగ్గకపోవడంతో చాందిని శుక్రవారం మృతి చెందింది. భార్య మరణాన్ని భర్త జీర్ణించుకోలేకపోయాడు. పసికందును ఎత్తుకుని.. తల్లిలేని లోటు ఎవరు తీరుస్తారంటూ కన్నీరుమున్నీరయ్యాడు.

అమ్మకు కడుపుకోత



☛ హిందూపురానికి చెందిన ఓ మహిళ గర్భం దాల్చింది. పరీక్షల నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి వెళ్తే... వైద్యులు అందుబాటులో లేరు. అక్కడే ఉన్న సిబ్బంది పక్కనే ప్రైవేటు ఆస్పత్రి ఉందని.. అక్కడికి వెళ్తే మెరుగైన వైద్యం అందిస్తారని చెప్పడంతో అక్కడికి వెళ్లి ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంది. నెలలు నిండటంతో అదే ఆస్పత్రిలో చేరింది. అయితే ప్రసవ సమయంలో పురిటి నొప్పులు రాలేదని.. వెంటనే సిజేరియన్ చేయాలని అక్కడి వైద్యులు భయపెట్టారు. గర్భిణి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో సిజేరియన్ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నప్పటికీ డిశ్చార్జి అయ్యే సమయానికి రూ.90 వేలు బిల్లు చెల్లించాల్సి వచ్చింది.

☛ పుట్టపర్తికి చెందిన ఓ మహిళ గర్భం దాల్చిన సమయం నుంచి ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేది. సాధారణ ప్రసవం కోసమేనని ముందుగా అడగడంతో వైద్యులు సరే అన్నారు. అయితే ప్రసవ సమయంలో మాట మార్చారు. ఆలస్యం చేస్తే తల్లీబిడ్డ ప్రాణాలకు ప్రమాదమని.. వెంటనే సిజేరియన్ చేయాలని భయపెట్టారు. దీంతో గర్భిణి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఆమెకు సిజేరియన్ చేశారు. ఇంటికి వెళ్లే సమయానికి రూ.66 వేలు బిల్లు వేశారు. మామూలు ప్రసవం చేస్తామన్నారు కదా అని అడగ్గా.. అనారోగ్యం చెప్పి వస్తుందా? అంటూ మాట దాటవేశారని బాధితులు వివరించారు.

కడుపు పండిందా...కడుపు కోయాల్సిందే అన్నట్లుగా మారింది ప్రస్తుత పరిస్థితి. ప్రసవం కోసం ఆస్పత్రి మెట్లెక్కితే చాలు... ఆధునిక వైద్యులు పురిటి నొప్పులు కూడా తెలియకుండానే అమ్మల కడుపు కోసేస్తున్నారు. క్షణాల్లో బిడ్డను చేతుల్లో పెట్టి రూ.లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారు. ఏడాదిలో జరిగిన ప్రసవాలను గమనిస్తే కోతల సంఖ్య ప్రైవేటులోనే అధికంగా ఉండటం... సిజేరియన్ తర్వాత మహిళల ఆరోగ్యం దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది.

- జిల్లాలో సగానికి పైగా కత్తెర కాన్పులే
- ప్రైవేటు ఆస్పత్రుల్లో విరివిగా సిజేరియన్లు
- కాసుల కక్కుర్తితో కడుపు కోస్తున్న డాక్టర్లు
- సిజేరియన్‌కు రూ.30 వేల నుంచి రూ.లక్ష వసూలు
- అనవసర సిజేరియన్లతో తల్లీబిడ్డ ఆరోగ్యానికి గండం

కాన్పుల వివరాలు ఇలా..

ఆస్పత్రి	సాధారణ ప్రసవాలు	సిజేరియన్	మొత్తం
ప్రభుత్వ	4,256	1,589	5,845
ప్రైవేటు	6,290	5,726	12,016

సాక్షి, పుట్టపర్తి

మాతృత్వం ప్రతి మహిళకు అపురూపం. అందుకే పురిటినొప్పులు భరించి తన ప్రతిరూపానికి ఊపిరి పోసి ఆనంద పడుతుంది. ఇదంతా సహజంగా జరిగితే తల్లీబిడ్డకు ఎంతో మేలు జరుగుతుంది. కానీ ఆధునిక యుగంలో మానవత్వం కనుమరుగై 'మనీ' రాజ్యం నడుస్తోంది. అందుకే ప్రసవానికి ఆస్పత్రికి వచ్చే వారు సాధారణ కాన్పు అయ్యే అవకాశం ఉన్నా... ప్రైవేటు వైద్యులు భయపెడుతున్నారు. అరగంట ఆలస్యమైతే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరిస్తూ సిజేరియన్‌కు ఒప్పిస్తున్నారు. తల్లుల కడుపులు కోస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. ఆరోగ్య పరిస్థితి ఆధారంగా ఒక్క సిజేరియన్‌కు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

ప్రైవేటులోనే అధికం..

సాధారణ కాన్పు అయితే రెండు రోజుల్లోనే ఇంటికి వెళ్లిపోవచ్చు. సిజేరియన్ అయితే వారం రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాల్సి ఉంటుంది. ఇలా రెండు రోజుల్లో బాలింత ఇంటికి వెళ్లిపోతే తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదని భావించిన ప్రైవేటు వైద్యులు సిజేరియన్ చేసి వారం పాటు ఆస్పత్రిలోనే ఉంచేస్తున్నారు. ఇందుకోసం భారీగా దండుకుంటున్నారు.

ప్రభుత్వ వైద్యులే అధికం..

జిల్లా ప్రభుత్వాస్పత్రితో పని చేసే వైద్యులందరికీ ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఆస్పత్రులు సొంతంగా లేనివారు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇతరుల ఆస్పత్రుల్లో పని చేస్తున్నారు. దీంతో ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారిని ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైద్యులే 'ప్రైవేటు సలహా' ఇస్తుండగా.. మరికొందరు మాత్రం సిబ్బందితో చెప్పిస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల ప్రభుత్వాస్పత్రుల పర్యవేక్షణ గాడితప్పడం.. నిర్వహణ లోపం కారణంగా గర్భిణులు కూడా ప్రైవేటుకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ప్రైవేటుకే ఎక్కువ కేసులు వెళ్తున్నాయి. సిజేరియన్లూ అక్కడే ఎక్కువగా జరుగుతున్నాయి.

తల్లీబిడ్డ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..



సిజేరియన్ ప్రభావం తల్లీబిడ్డ ఆరోగ్యంపై ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగిస్తే బిడ్డకు చాలా మేలు జరుగుతుంది. కానీ సిజేరియన్ వల్ల తొలిగంటలో తల్లుల నుంచి బిడ్డకు పాలు అందే అవకాశం లేకుండా పోతోంది. పైగా సిజేరియన్ సమయంలో రక్తస్రావం ఎక్కువగా జరిగి మరణాలూ సంభవించే ప్రమాదం ఉంటుంది. ఒక వేళ సిజేరియన్ ఇబ్బంది లేకుండా జరిగినా ఆ తర్వాత మహిళలు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, రెండోసారి గర్భం ధరించేందుకు మరింత సమయం పడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అన్నీ తెలిసీ కొందరు ప్రైవేటు వైద్యులు కాసుల కోసం అమ్మకడుపునకు పెడుతున్న కోతలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



సాధారణ ప్రసవానికి.. సిజేరియన్‌కు మధ్య తేడాల గురించి, సిజేరియన్ వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. అలాంటి ఫిర్యాదులు వస్తే తప్పకుండా విచారణ చేపట్టి తగిన చర్యలకు సిఫారసు చేస్తాం. ప్రజారోగ్యం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసే వైద్యులు నిర్ణీత సమయంలో ఆస్పత్రుల్లోనే ఉండాలి. ఆ తర్వాత ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేసినా డ్యూటీ కాల్ వస్తే.. వెంటనే వెళ్లాలనే నిబంధన అమలు చేస్తున్నాం. – ఫైరోజాబేగం, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

పెద్దమ్మతల్లికి ఆషాఢ అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ధర్మవరం రూరల్: పట్టణంలోని సాలే వీధిలో వెలసిన పెద్దమ్మతల్లి ఆషాఢ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకుడు వెంకటేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని చీరలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం: రాగల ఐదు రోజులూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. భారీ గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

16న రామగిరి ఎంపీపీ ఎన్నిక

- ఈసారైనా ప్రక్రియ సజావుగా జరిగేనా..?
- ఇప్పటికే టీడీపీ ఓవరాక్షన్‌తో రెండుసార్లు వాయిదా
- మెజార్టీతో పీఠం దక్కించుకునేందుకు సిద్ధమైన వైఎస్సార్ సీపీ



రామగిరి మండలపరిషత్ కార్యాలయం

రామగిరి: టీడీపీ అరాచకంతో రెండుసార్లు వాయిదా పడిన రామగిరి మండల పరిషత్ అధ్యక్ష పదవికి ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈనెల 16వ తేదీ ఎన్నిక ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెజార్టీ లేకపోయినా ఎలాగైనా రామగిరి ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు టీడీపీ కుయుక్తులు, కుట్రలు, అల్లర్లకు పాల్పడగా... ఇప్పటికే రెండు సార్లు ఎన్నిక వాయిదా పడింది. తాజాగా అధికారులు మరోసారి నోటిఫికేషన్ ఇవ్వగా..ఈసారైనా ఎన్నిక సజావుగా జరిగేనా అంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

10 స్థానాల్లో 9 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే..

రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలుండగా... గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పేరూరు- 1, పేరూరు- 2, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి, మాదాపురం, రామగిరి ...ఇలా 9 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజయ కేతనం ఎగురవేశారు. కేవలం నసనకోట స్థానాన్ని మాత్రం టీడీపీ దక్కించుకోగలిగింది. రామగిరి ఎంపీపీ స్థానాన్ని ప్రభుత్వం అన్‌రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించడంతో రామగిరి స్థానం నుంచి గెలిచిన మీనుగ నాగమ్మను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఎంపీపీ పీఠంపై కూర్చోబెట్టారు. అయితే ఆమె అనారోగ్యంతో 2024 డిసెంబర్ 30న మృతి చెందగా...రామగిరి ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది.

కుట్రలు.. అల్లర్లతో వాయిదాల పర్వం..

ఎంపీపీ మీనుగ నాగమ్మ మృతి నేపథ్యంలో 2025 మార్చి 27న ఎంపీపీ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం అధికారంలోకి ఉన్న టీడీపీ నాయకురాలు ఎలాగైనా తన సొంత మండలం రామగిరి పీఠం దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నించారు. కేవలం ఒక్క ఎంపీటీసీ స్థానంతోనే పీఠంపై జెండా ఎగురవేయాలని కుట్ర చేశారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన పేరూరు-1, మాదాపురం ఎంపీటీసీ సభ్యులకు టీడీపీ కండువాలు కప్పి తమవైపునకు తిప్పుకున్నారు. అంతేకాకుండా మిగతా వారినీ భయపెట్టి ఎలాగైనా ఎంపీపీ స్థానం దక్కించుకోవాలని భావించారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ తమ అభ్యర్థులకు రక్షణ కల్పించేందుకు మరో ప్రాంతానికి తరలించింది. సరిగ్గా ఎన్నిక రోజున వారందరినీ రామగిరికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో పేరూరు-2 ఎంపీటీసీ సభ్యురాలిని టీడీపీ నాయకులు బలవంతంగా తీసుకువెళ్లారు. దీంతో ఘర్షణ వాతావరణం చేటుచేసుకోగా, ఎన్నిక సమయానికి ఎంపీటీసీ సభ్యులు రామగిరి చేరుకోలేక పోయారు. దీంతో కోరం లేక ఎన్నికను వాయిదా వేశారు. అనంతరం మే 19న మరోసారి రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చినా ... టీడీపీ నేతల బెదిరింపులతో ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు ఎంపీటీసీలు ప్రకటించారు. దీంతో ప్రభుత్వం తాజాగా మరోసారి నోటిఫికేషన్ ఇచ్చింది.

ఒక్క అభ్యర్థితో పీఠం కోసం టీడీపీ పాకులాట

రామగిరి ఎంపీపీ మహిళకు రిజర్వ్ అయ్యింది. టీడీపీ తరఫున గెలిచింది ఒకే ఒక ఎంపీటీసీ...పైగా మహిళ కాదు. అయినప్పటికీ స్థానిక టీడీపీ నాయకులు రామగిరి ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈనెల 16న జరిగే ఎన్నికలో ఎలాగైనా విజయం సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం టీడీపీ వైపు నిలిచిన ముగ్గురు ఎంపీటీసీలూ పురుషులే కాగా, మహిళా స్థానం ఎలా దక్కించుకుంటారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



కన్యకాపరమేశ్వరికి పుష్పయాగం



అమ్మవారికి పుష్పాలు సమర్పించడానికి ర్యాలీగా తరలివస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళలు



అమ్మవారికి పుష్పార్చనలు చేస్తున్న కమిటీ సభ్యులు

హిందూపురం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని హిందూపురం కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం మహా పుష్పయాగం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్దసంఖ్యలో పూలబుట్టలతో తరలి వచ్చి అమ్మవారికి సమర్పించారు. వివిధ రకాల పుష్పాలతో అర్చనలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజీమార్గమే రాజమార్గం



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లునాయక్

హిందూపురం: రాజీమార్గమే రాజమార్గమని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకొని కక్షిదారుల సమస్యలను పరిష్కరించడంలో సహకరించాలన్నారు. ఇరువర్గాలు ఒక అవగాహనకు వచ్చి రాజీ కావడంతో డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. ఇందుకు లోక్అదాలత్ బాగా ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో న్యాయవాదులు సిద్ధు, రాజశేఖర్, కళావతి, సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

జాబిలికి ఇంటర్నేషనల్ గ్లోరీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జాబిలి చాంద్‌బాషా

పెనుకొండ: పట్టణానికి చెందిన ప్రముఖ కవి జాబిలి చాంద్‌బాషాకు ఇంటర్నేషనల్ గ్లోరీ పురస్కారం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ గానసభ వేదికగా మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు మహాకవి సమ్మేళనంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న చాంద్‌బాషాకు ప్రముఖ కవులు రమణాచారి, రఘువీర్‌ప్రతాప్, డాక్టర్ చక్రవర్తి తదితరులు పురస్కారం అందజేసారు.

మిస్సింగ్... మిస్టరీ!

- జిల్లాలో పెరుగుతున్న మహిళల అదృశ్యం కేసులు
- ప్రేమ, వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలే కారణం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల యువతులు, వివాహిత మహిళల అదృశ్యం పోలీసులను కలవర పెడుతోంది. ఒకరి తర్వాత ఒకరు చొప్పున వరుసగా కనిపించకుండా పోతున్నారు. అదృశ్యమైన వారిని పట్టుకోవడం పోలీసులకు సైతం సవాల్‌గా మారుతోంది.



అనంతపురం/రాప్తాడు రూరల్: మన సంస్కృతీసంప్రదాయాలకు విరుద్ధంగా ఇటీవల చోటు చేసుకుంటున్న కొన్ని సంఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. పెళ్లయిన వ్యక్తుల వెంట పెళ్లికాని అమ్మాయిలు వెళ్తుండడం, మరోవైపు పెళ్లయిన మహిళలు సైతం పెళ్లయిన మరో వ్యక్తితో సహజీవనం చేసేందుకు ఆసక్తి చూపుతుండడం ఆందోళన కలిగిస్తున్నాయని పోలీసు అధికారులు అంటున్నారు. ఇటీవల అనంతపురం రూరల్ పరిధిలోని అక్కంపల్లి పంచాయతీకి చెందిన కుమ్మర సురేష్‌బాబు భార్య అనిత అదే కాలనీకి చెందిన బాబాఫక్రుద్దీన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తమ ఆనందానికి అడ్డువస్తున్నాడనే కారణంతో ప్రియుడిని ప్రేరేపించి భర్తను అంతమొందించింది. అలాగే పెళ్లయి ఇద్దరు పిల్లలు, భర్త ఉన్న మరో మహిళ...పెళ్లయి ఇద్దరు పిల్లలున్న మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని అతడితో వెళ్లిపోయింది. ఇటీవల కూడేరు మండల పరిధిలో దారుణహత్యకు గురైన బాలిక...పెళ్లయిన వ్యక్తితో ప్రేమాయణం నడిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలాంటి ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. మూడుముళ్ల బంధానికి విలువ లేకుండా చేస్తున్నాయంటూ పలువురు వాపోతున్నారు.

225 మంది మాయం..

మహిళల అదృశ్యాలకు ప్రధానంగా ప్రేమ వ్యవహారాలు, వివాహేతర సంబంధాలే కారణమని పోలీసులు చెబుతున్నారు. యువతుల్లో ఎక్కువ మంది ప్రేమికుడిని దక్కించుకోవడం కోసమే ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. అలాగే మధ్య వయస్కులైన మహిళలు సైతం వివాహేతర సంబంధాల కారణంగా భర్తను, పిల్లలను వదిలి వెళ్తున్నారు. మిస్సింగ్ కేసుల్లో సుమారు 75 శాతం వరకు ఈ రెండు కారణాలే ఉన్నాయని పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిస్సింగ్ కేసులు అత్యధికంగా నమోదయ్యాయి. ఒక్క ఏడాదిలోనే 225 మంది మహిళలు అదృశ్యమయ్యారు. ఇప్పటి వరకూ 155 మంది ఆచూకీ లభ్యమైంది. మిగిలిన 70 మంది ఏమయ్యారనేది మిస్టరీగానే ఉండిపోయింది. దీంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వీరు ప్రేమ, ఇతర కారణాలతో కావాలనే వెళ్లిపోయారా? అన్నది తెలియాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా సాగుతోందని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన సంచలన వ్యాఖ్యలకు ఈ నెల 10తో రెండేళ్లు గడిచాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాదిలోనే వందలాది మంది మహిళలు, యువతులు కనిపించకుండా పోవడంపై కనీసం పల్లెత్తు మాట కూడా పవన్ కళ్యాణ్ మాట్లాడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

ప్రేమ కథావి‘చిత్రం’

అనంతపురం నగర శివారులో వెలుగు చూసిన ఉదంతం ఓ కుటుంబాన్ని తలెత్తుకుని తిరగలేకుండా చేసింది. ఎంతో అన్యోన్యంగా ఉంటున్న ఇద్దరు యువతుల్లో ఒకరికి వివాహం నిశ్చయమైంది. ఆ సమయంలో వరుడికి తన స్నేహితురాలిని పరిచయం చేసింది. ఈ పరిచయాన్ని ఆమె చనువుగా మార్చుకుంది. తరచూ మొబైల్‌లో చాటింగ్‌లు చేసుకునేవారు. ఈ చాటింగ్ గమనించిన యువతి... పెళ్లికి మరింత సమయం ఉండడంతో తన స్నేహితురాలని ప్రశ్నించింది. ‘మీ ఇద్దరు ప్రేమించుకుంటున్నారా? అలాంటిది ఏమైనా ఉంటే ఇప్పుడే చెబితే నేను సైడ్ అయిపోతా. మీరిద్దరూ పెళ్లి చేసుకోండి’ అంటూ చెప్పింది. ‘అబ్బే మా మధ్య అలాంటిదేమీ లేదు. నువ్వే పెళ్లి చేసుకుని హ్యాపీగా ఉండు’ అంటూ స్నేహితురాలు నమ్మబలకడంతో నిజమేనని నమ్మి ఆ యువతి పెళ్లి చేసుకుంది. ఈ సంతోషం ఎంతో కాలమూ నిలవలేదు. నిన్ను విడిచి నేనుండలేనంటూ ఆ యువకుడిని పలుమార్లు ఫోన్లు చేసి, మెసేజ్‌లు పెట్టింది. తర్వాత తన ప్రాణ స్నేహితురాలి భర్తతో కలసి ఉడాయించింది. ఈ ఘటనతో యువతి కుటుంబం సమాజంలో తలెత్తుకుని తిరగలేని స్థితికి చేరుకుంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వీలైనంత త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని చెబుతున్నారు.

వివాహిత అదృశ్యం

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన ఓ వివాహిత కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. పోట్లమర్రి గ్రామానికి చెందిన దళితురాలు శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. సాయంత్రమైనా ఆమె రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య



మాట్లాతున్న డీసీ నాగముద్దయ్య

పుట్టపర్తి టౌన్: నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, సూపరింటెండెంట్ నరసింహులుతో కలసి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్షించారు. నాటుసారా, నవోదయం, అక్రమ మద్యం రవాణాపై రివ్యూ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటించి నాటుసారా తయారీదారులు, అమ్మకందారులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. శిస్తు కట్టని మద్యం అమ్మకందారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కల్లు కల్తీ కాకుండా నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి గోవింద్‌నాయక్, శ్రీరామ్‌తో పాటు ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కళ్లలో కారం కొట్టి.. కత్తితో పొడిచి!

- యువకుడి ప్రాణం బలిగొన్న వివాహేతర సంబంధం





హతుడు నవీన్‌కుమార్

కదిరి అర్బన్: వివాహేతర సంబంధం ఓ యువకుడి హత్యకు దారి తీసింది. ఇంటి పెద్ద మృతితో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. ఈ ఘటన కదిరి మండలం బందార్లపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బందార్లపల్లికి చెందిన నవీన్‌కుమార్ (35)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మగ్గం పనితో కుటుంబాన్ని పోషించుకునేవాడు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యం కారణంగా భార్య మృతి చెందింది. అప్పటి నుంచి చిన్నారుల ఆలనాపాలన చూసుకుంటూ వారిని నవీన్‌కుమార్ అల్లారుముద్దుగా పెంచుకుంటూ వస్తున్నాడు.

పెడదోవ పట్టించిన పరిచయం..

బందార్లపల్లికి చెందిన విశ్వనాథ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కదిరిలోని ఓ హోటల్‌లో విశ్వనాథ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో కొన్నేళ్ల క్రితం విశ్వనాథ్ భార్యతో నవీన్‌కుమార్‌కు పరిచయమైంది. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయాన్ని పసిగట్టిన విశ్వనాథ్ పలుమార్లు నవీన్‌కుమార్‌ను మందలించాడు. పద్ధతి మార్చుకోవాలని హితవు పలికాడు. నవీన్‌కుమార్ తీరులో మార్పు రాకపోవడంతో చివరకు కుటుంబ సభ్యులను పిలుచుకుని విశ్వనాథ్ కదిరికి మకాం మార్చాడు. అయినా నవీన్‌కుమార్ తరచూ తన భార్యతో చాటింగ్ చేస్తూ.. అప్పుడప్పుడు వచ్చి కలిసి వెళ్లిపోవడాన్ని గమనించిన విశ్వనాథ్ ఎలాగైనా నవీన్‌కుమార్‌ను అడ్డు తొలగించి, తన కుటుంబాన్ని కాపాడుకోవాలని అనుకున్నాడు.

పథకం ప్రకారం..

ఈ క్రమంలో నవీన్‌కుమార్ హత్యకు పథకం రచించిన విశ్వనాథ్.. అతని ప్రతి కదలికపై నిఘా ఉంచాడు. శుక్రవారం ఉదయం బందార్లపల్లికి చేరుకుని గ్రామ శివారున కాపుకాశాడు. బహిర్భూమికని ఒంటరిగా వస్తున్న నవీన్‌కుమార్ ఎదురుపడగానే ఒక్కసారిగా కళ్లలో కారంపొడి చల్లాడు. అనంతరం సిద్ధంగా ఉంచుకున్న కత్తితో కడుపు, ఛాతీపై పలుమార్లు పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో నవీన్‌కుమార్ ప్రాణాలు కోల్పోయిన తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న కదిరి రూరల్ యూజీపీఎస్ సీఐ నిరంజనరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, విశ్వనాథ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ప్రాణాలు బలిగొన్న చేపల వేట సరదా

- నీట మునిగి ఇద్దరు యువకుల మృతి



మృతులు జబీవుల్లా, మన్సూర్‌బాషా

గుమ్మఘట్ట: చేపల వేట సరదా ఇద్దరి ప్రాణాలు బలిగొంది. స్థానికులు తెలిపిన మేరకు.. రాయదుర్గం పట్టణానికి చెందిన మన్సూర్ బాషా (34), కర్ణాటకలోని రాంపుర గ్రామానికి చెందిన జబీవుల్లా (28) ఇద్దరూ మంచి స్నేహితులు. మన్సూర్‌బాషాకు భార్య టబూ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అలాగే జబీవుల్లాకు భార్య గుల్జార్‌భాను, ఇద్దరు కుమారులు ఉన్నారు. డ్రైవింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. చేపల వేట అంటే ఎంతో ఆసక్తి ఉన్న ఇద్దరూ గురువారం గాలాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై గుమ్మఘట్ట మండలంలోని బీటీ ప్రాజెక్ట్‌కు చేరుకున్నారు. గాలం వేసే సమయంలో ప్రమాదవశాత్తు మన్సూర్‌బాషా అదుపు తప్పి నీటిలో పడిపోవడంతో స్నేహితుడిని కాపాడేందుకు తనకు ఈత రాకపోయినా జబీవుల్లా దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ నీట మునిగి ఊపిరాడక మృతిచెందారు. శుక్రవారం ఉదయం నీటిలో మృతదేహాలు తేలియాడుతుండడం గమనించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను వెలికి తీయించారు. ద్విచక్ర వాహనం నంబర్ ఆధారంగా సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతులను మన్సూర్‌బాషా, జబీవుల్లాగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హిందీ టీచర్‌ను నియమించండి

- తూముకుంట వలస కార్మికుల పిల్లల వేడుకోలు



హిందీ టీచర్‌ను నియమించాలని వేడుకుంటున్న వలస కార్మికుల పిల్లలు

హిందూపురం: తమకు హిందీ టీచర్‌ను నియమించాలని హిందూపురం మండలం తూముకుంట గ్రామ పాఠశాల విద్యార్థులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. తూముకుంటలోని పారిశ్రామిక వాడలో బిహార్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారు. వీరి పిల్లలు 50 మంది స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నారు. అయితే భాష తెలియని కారణంగా మరో వంద పిల్లలు పాఠశాలకు దూరమయ్యారు. విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించినా హిందీ టీచర్‌ను నియమించకపోవడంతో చివరకు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి నాలుగు నెలల క్రితమే ఆర్‌జేడీతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకూ హిందీ టీచర్‌ను నియమించకపోవడంతో వలస కార్మికుల పిల్లలు బడికి దూరమవుతున్నారు. దీంతో హిందీ టీచర్‌ను ఏర్పాటు చేసి, తమ పిల్లలు భవిష్యత్తును కాపాడాలని వలస కార్మికులు కోరుతున్నారు.

బాలికలకు రక్షణ కరవు..

ప్రస్తుతం తూముకుంట పాఠశాలకు ప్రహరీ లేదు. ఈ పాఠశాలలోని రెండే గదుల్లో 1 నుంచి 5వ తరగతి వరకు వంద మంది విద్యార్థులు ఉన్నారు. ప్రహరీ లేకపోవడంతో తరచూ తాగుబోతులు పాఠశాలలో చేరి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ బాలికపై అఘాయిత్యం కూడా జరిగింది. అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గాండ్లపెంటలో వరుస చోరీలు

గాండ్లపెంట: మండల కేంద్రంలో గురువారం రాత్రి వరుస చోరీలు జరిగాయి. ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని కాలనీ ఉన్న గొర్రెల కాపరి పామిడి మస్తాన్‌వలి ఇంట్లో బీరువా తాళాలు తీసి 4 తులాల బంగారు ఆభరణాలు, రెండు జతల కమ్మలు, ఒక నెక్లెస్ అపహరించారు. అలాగే కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో ఉన్న సాదిక్ నిర్వహిస్తున్న టీకేఫ్‌లోకి చొరబడి రూ.30వేలు విలువ చేసే గ్రైండర్‌తో పాటు కూల్‌డ్రింక్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లారు. అనంతరం అదే మార్గంలోని నాగకుమారి టీ హోటల్‌లో చొరబడి రెండు ప్యాకెట్ల బియ్యం, గ్యాస్ సిలిండర్, ఉన్నత పాఠశాల వెనుక వైపు ఉన్న సుబహాన్ టైలర్ షాపులో దుస్తులు అపహరించారు. బాధితుల నుంచి శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎన్‌పీ కుంట, నల్లచెరువు ఎస్ఐలు వలీబాషా, మక్బూల్‌బాషా, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు విద్యను దూరం చేస్తున్న చంద్రబాబు

- మాజీ మంత్రి సాకే శైలజనాథ్



మాట్లాడుతున్న శైలజనాథ్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో పేద పిల్లలకు విద్య దూరమవుతోందని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా సీఎంగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబు విద్యావ్యవస్థ అభివృద్ధికి చేసిన మంచి పని అంటూ ఏ ఒక్కటీ లేదని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల పేర్లు మార్చి అభూత కల్పన చేస్తున్న సీఎం చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. పేరెంట్స్ టీచర్ మీటింగ్ జగనన్న తీసుకువచ్చిందేనన్నారు. శ్రీ సత్యసాయిజిల్లా కొత్తచెరువు ప్రభుత్వ హైస్కూల్‌లో తల్లిదండ్రులకు టీచర్స్ మీటింగ్‌లో పిల్లలకు పాఠాలు బోధించిన మీరు రెండు నెలల క్రితం అదే జిల్లాలో ఏడుగుర్రాలపల్లిలో 9వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థినిపై మృగాళ్లు దాడి చేస్తే ఇంత వరకు బాధితురాలి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అక్కడ బాధింపబడిన కుటుంబం మీ పార్టీకి చెందిన వారే అని ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసిన కిరాతకులు మీవారేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓ బాధిత బాలికలకు భరోసా కల్పించలేని మీరు రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి భరోసా కల్పిస్తారో చెప్పాలన్నారు. కుమారుడు లోకేష్ భవిష్యత్తుపై ఉన్న భరోసా పేద ప్రజలపై సీఎం చంద్రబాబుకు లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి చంద్రబాబు అసమర్థ పాలనే కారణమన్నారు.

పాఠశాల సమస్యలపై మంత్రికి విద్యార్థుల వినతి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న మంత్రి సవిత

పరిగి: తమ పాఠశాలలో నెలకొన్న వాటర్ ప్లాంట్, ప్రహరీ, క్రీడా మైదానం తదితర సమస్యలను పరిష్కరించాలని మంత్రి సవితకు ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నవించారు. శుక్రవారం మంత్రి సవిత పరిగి మండలంలో పర్యటించారు. తొలుత కొడిగెనహళ్లి పంచాయతీ బిందూనగర్‌లో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులతో ఆరా తీశారు. ప్రహరీతో పాటూ క్రీడా మైదానం చదును తదితర అంశాలను మంత్రి దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. అనంతరం పి.నరసాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు మహేంద్ర

పుట్టపర్తి టౌన్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లికి చెందిన చాకలి మహేంద్ర (36)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తండ్రి వైద్యానికి, కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. వ్యాధి నయం కాకపోవడంతో కొంత కాలం క్రితం తండ్రి మృతి చెందాడు. తన సంపాదనతో అప్పులు తీర్చడం సాధ్యం కాదని తరచూ మదన పడుతున్న ఆయన శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లుంగీతో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గమనించిన భార్య వెంటనే బంధువుల సాయంతో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న సీఐ సునీత అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అధికారుల వేధింపులు తాళలేక.. ఆత్మహత్యాయత్నం

గుంతకల్లు/టౌన్: అధికారుల వేధింపులు తాళలేక విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారు. బాధితుని బంధువులు, తోటి ఉద్యోగులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న అన్సూర్ గతంలో గుత్తి ట్రాన్స్‌కో పరిధిలోని ఆర్‌టీఎస్ఎస్ (220కె.వి)లో కాంట్రాక్ట్ హెల్పర్‌గా పనిచేసేవాడు. పరస్పర బదిలీల్లో భాగంగా గుంతకల్లులోని ఆలూరు రోడ్డులో ఉన్న 132కేవీ సబ్‌స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్‌ను గుత్తికి బదిలీ చేశారు. అయితే ఈ బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందని ఓ సహోద్యోగి ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించాడు. దీంతో సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు అన్సూర్‌ను తిరిగి గుత్తికి వెళ్లిపోవాలని తీవ్రంగా ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం విధుల్లో ఉన్న సమయంలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి ఉద్యోగులు వెంటనే 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. తాము ఆస్పత్రికి వెళ్లేలోపు అతడిని రెఫర్ చేశారని, ఆత్మహత్యాయత్నానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని వన్‌టౌన్ పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై సంబంధిత ట్రాన్స్‌కో అధికారిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.





సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

అడ్మిషన్స్

■ APNCET (నర్సింగ్ సెట్) లో క్వాలిఫై కానీ స్టూడెంట్స్ కి B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ) కి గవర్నమెంట్ సీట్స్ కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. Cont : G.MURALI, 9030661651, అనంతపురం. [A-7135]

GNM అడ్మిషన్స్

■ ఇంటర్మీడియట్ లో Any Group పాస్ స్టూడెంట్స్ కి G.N.M (Nursing) కి గవర్నమెంట్ సీట్స్ కలవు. అనంతపురం నందు గల గర్ల్స్ కాలేజీ లో అడ్మిషన్స్ పొందవచ్చు. సంప్ర: G. మురళి, 9030661651, అనంతపురము. [A-7431]

REAL ESTATE

LEASE / RENT

■ ANANTAPUR HOUSING BOARD COLONY MPDO OFFICE BACK SIDE EAST FACE 1st FLOOR 2BHK (OFFICE, CLINIC Playschool) LEASE / RENT 9849463347. [SCA25006152]

SERVICES

ASTROLOGY

■ శ్రీ దుర్గాదేవి జ్యోతిష్యాలయం పండిత్ యస్. రాఘవేంద్ర శాస్త్రిగారు మీ సమస్యలకు ఫోన్ ద్వారా పరిష్కార మార్గం చెప్పబడును. స్త్రీ పురుషులకు ఎటువంటి కఠిన సమస్యలున్న దుర్గా దేవి పూజ హోమం ద్వారా శాశ్వత పరిష్కారం చూపించబడును. 9948667577. [G-643]

WANTED

■ అనంతపురం, గార్లదిన్నె బత్తాయి తోటలో పనిచేయుటకు/ ఫ్యామిలీ కావలెను. రూం + కరెంటు, భోజన వసతి కలదు. జీతం: రూ॥ 14000/- సెల్ : 78010 11377. [A-1666]

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: - డిగ్రీ, జీతం:- 20 వేల వరకు. సంప్ర॥ 9908429239 [G-646]

■ Wanted Sales Manager and assistant sales manager in popular mobile stores are preferable. Ph.No: 9133399257, 9703333378. [G-145]

■ ATP లోకల్‌లో ఇల్లు, ఆఫీస్‌లు ట్యాంక్‌లు, సంపులు, వాష్ రూమ్స్ క్లీనింగ్ బాయ్స్-2 & సేల్స్ మెన్ కావలెను. సెల్ : 9705819121. [SCA25005918]

■ Opportunity for Male Managers with good pay in Naturals Saloon A. 20-30 should understand. Hindi, Sainagar, Atp. 8096000222 [SCA25006153]

■ డ్రైవర్స్ కావలెను. డ్రైవింగ్ లైసెన్స్, EXP: 3 సం: విద్యార్హత : 10th పాస్/ ఫెయిల్. వయస్సు: 20-35 సం.లోపు, జీతం: ₹15,500+ PF+ESIC, TA, O.T, భోజన సదుపాయం కలవు. # SDT రైడర్స్ లాజిస్టిక్స్ ప్రై.లి. హుండాయ్ గ్లోవిస్ &VPC, కియా, పెనుగొండ. 9066192421, 9390490947. [A-7136]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బిల్ ఇన్ ప్రా నందు పనిచేయుటకు, అనుభవం గల టెలికాలర్స్ (స్త్రీలు) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టీమ్‌తో వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్‌డ్ జీతం ఇవ్వబడును. అడ్రస్: 1వ ఫ్లోర్, సహస్రా అపార్ట్‌మెంట్, బళ్ళారి రోడ్, అనంతపురం. సెల్: 9989452444. [A-1667]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
(GST 5% అదనం)

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088 RAYADURG : 9010470185